# కథాకేళి



## ఇంటింటి కథ

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆఫీసునించి ఇంటికి తిరిగివచ్చిన బోస్ తన భార్య ఇచ్చిన కాఫీ తాగాక అడిగాడు.

"పాత టెలిఫోన్ ఇండెక్స్‌లోంచి నంబర్లని కొత్త దాంట్లో రాయమన్నాను. రాసావా?"

"ఇంకా లేదండి. రేపు రాస్తాను" చెప్పింది మిసెస్ బోస్.

వెంటనే బోస్‌లో కోపం చోటు చేసుకుంది.

"ఎన్ని రోజుల నించి చెప్తున్నాను? కనీసం పది రోజులు. పొద్దున్నించి సాయంత్రం దాకా ఇంట్లోనే తీరికగా గడిపేబదులు రాయచ్చుగా. మరీ అంత బద్ధకం పనికి రాదు" చెప్పాడు.

"తీరికగా గడుపుతున్నానా? పనితో చస్తుంటే!" చెప్పింది మిసెస్ బోస్.

"పని పని అంటావ్. ఏం పని చేస్తావ్?"

"ఏం పనంటే ఏం చెప్పను? చాలా"

"ఎటూ పనిమనిషి గిన్నెలు కడుగుతుంది. వాటిని తుడిచి బోర్లించాక ఇంకేం పనుంటుంది. బద్ధకం అని ఒప్పుకో" అరిచాడు బోస్.

మిసెస్ బోస్ మొహం కోపంతో మాడిపోయింది. మారుమాట్లాడలేదు. ఆ రోజంతా ముభావంగానే వుంది. భార్య అలిగిందని గ్రహించిన బోస్ ఆమె చేత మాట్లాడించడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు.

"ఈ రోజు రాత్రి భోజనానికి బయటకి వెళదామోయ్. సెకండ్ షో సినిమా కూడా చూసి వద్దాం" చెప్పాడు.

"అక్కర్లేదు" చెప్పింది ఆమె కోపంగా.

"నేనే మన్నానని! పాత ఇండెక్స్ పుస్తకంలో కాగితాలు చిరిగిపోయాయి. పోతే కష్టం అని చెప్పానంతే. నీకు తీరికున్నప్పుడే రాయి."

"రాయకుండా వుంటానా? రేపు మీరు ఆఫీస్ నించి వచ్చేప్పటికి రాసుంచుతాను. అసలు మీ భర్తలకి భార్యల విలువ తెలిస్తేగా."

"ష్. కోపం అనేది ముక్కు మీదుంటే అందం. ఇలా గొంతు దాకా' వుండకూడదు."

మర్నాడు ఉదయం బోస్ భోజనం చేసి ఆఫీస్‌కి వెళ్ళేదాకా కూడా మిసెస్ బోస్ అదే మూడ్‌లోవుంది.

బోస్ సాయంత్రం ఆఫీస్ నించి ఇంటికి వచ్చాడు. కుర్చీలో కూలబడి బూట్లు, సాక్స్ విప్పాడు.

అతనికి కాఫీ ఇచ్చాక మౌనంగా ఓ పుస్తకం ఇచ్చి చెప్పింది.

"కొత్త టెలిఫోన్ ఇండెక్స్ బుక్. పూర్తిగా రాసావో లేదో చెక్ చేసుకోండి."

"నువ్వింకా అదే మనసులో పెట్టుకున్నావా?" నవ్వాడు.

మిసెస్ బోస్ సమాధానం చెప్పలేదు.

"ఇదేమిటి? ఇల్లిలా వుంది!" అడిగాడు బోస్ అటు, ఇటు చూసి.

ముందు గదిలో పేపర్లన్నీ చిందరవందరగా పడి వున్నాయి. ఎవరో తాగిన కాఫీ గ్లాస్‌లోంచి వలికిన కాఫీ చుక్కలు నేలమీద ఎండిపోయి వున్నాయి. వాటి మీద ఈగలు వాలుతున్నాయి. బయట వుండాల్సిన ఇటుకరాళ్ళు డైనింగ్ టేబిల్ మీద వున్నాయి. బట్టలు ఇంటి నిండా చెల్లాచెదురుగా పడివున్నాయి. వంట గదిలో తరిగిన కూరల చెక్కలు కాళ్ళకి అంటుతూ నేలమీద పడి వున్నాయి. పాట్లాలకి కట్టిన దారాలు కిటికీలోంచి వేలాడుతున్నాయి. నూనె హాల్లో ఒలికి వుంది. బాత్‌రూంలో బకెట్‌లో పడ్డ సబ్బు సగం పైనే కరిగివుంది.

"చెప్పవేం ఏమిటిది?" అడిగాడు బోస్ ఇల్లంతా తిరిగి చూసి.

"మన పిల్లలిద్దరి ఘన కార్యం ఇది. నిన్న 'ఇంటి దగ్గర ఏం చేస్తావు? పని మనిషి కడిగిన గిన్నెలు తుడిచి బోర్లించడం తప్ప' అన్నారుగా. నేను ఇంటి దగ్గర ఏం చేయడం లేదో ఇవాళ చూస్తారని ఆ టెలిఫోన్ ఇండెక్స్‌లోని పేర్లు రాసాను" చెప్పింది మిసెస్ బోస్.

"ఏమిటి? రోజూ నువు ఇంత పని చేయాలా?" అడిగాడు ఆశ్చర్యంగా.

తర్వాత చెప్పాడు.

"సారీనోయ్. మీ ఆడవాళ్ళ కసలు పనేం వుంటుంది- ఇంటి దగ్గర సుఖపడడం తప్ప అనుకుంటుంటాం ఆఫీసుల్లోని మగాళ్ళం" చెప్పాడు బోస్.

